క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పెనుగంచిప్రోలు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ పూర్ణ చంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిచిపోతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

30లోగా పంటల నమోదు చేయించుకోవాలి



పెనుగంచిప్రోలు:రైతులంతా తప్పక ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి కోరారు. ఈ–క్రాప్ నమోదుకు సంబంధించి స్థానిక సచివాలయ ఆవరణలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ–క్రాప్ నమోదు చేయించుకున్న రైతుల వివరాలను సభలో చదివి వినిపించారు. ఏవో రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులు ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 29లోపు తెలియజేయాలని కోరారు. ఈ–క్రాప్ నమోదుకు ఈనెల 30 చివరి తేదీ అని తెలిపారు. పంటల వివరాలను నమోదు చేయించుకోని రైతులు, వెంటనే చేయించుకోవాలని కోరారు. వ్యవసాయ సలహామండలి చైర్మన్ చుంచు బెనర్జీ, గ్రామ కార్యదర్శి శ్యామ్, వీఆర్వోలు బేబి, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి పళ్లెం బహూకరణ



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి శుక్రవారం ప్రకాశంజిల్లా యర్రగొండపాలెం గ్రామానికి చెందిన అచ్యుత లక్ష్మణరావు, రామరత్నం దంపతులు 800 గ్రాములతో సుమారు రూ.56 వేల విలువైన వెండి ప్లేట్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



నందిగామ: పట్టణ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 11వ వార్డు పరిధిలో జరుగుతున్న దోమల నివారణ చర్యలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ అన్నివార్డుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నట్లు చెప్పారు. నీరు నిలువ ఉన్నచోట ఆయిల్ బాల్స్ ఏర్పాటు చేయడం, ఎబేట్ పిచికారీ చేయిస్తున్నామన్నారు. ప్రజలు కూడా తగు జాగ్రత్తలు పాటించి పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఆయన కోరారు.

పాఠశాలలకు వంటపాత్రల పంపిణీ



గుమ్మడిదూర్రు(పెనుగంచిప్రోలు):మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి పాఠశాలలకు వచ్చిన వంట పాత్రలను శుక్రవారం గ్రామంలోని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు సర్పంచ్ నక్కా కమల శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాలలకు గిన్నెలు, గరిటెలు, గంటెలు ప్రభుత్వం అందజేసినట్లు చెప్పారు. జగనన్న గోరుముద్ద ద్వారా ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందుతోందని వివరించారు. గ్రామ నాయకులు పొన్నం కోటేశ్వరరావు, సుధాకర్, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు ఆధునిక హంగులు

- రూ.2.32కోట్లతో మౌలిక వసతులు
- అందుబాటులోకి తరగతి గదులు, డైనింగ్ హాలు, కిచెన్ నిర్మాణం
- ప్రారంభానికి సిద్ధంగా భవనాలు



ప్రారంభానికి సిద్ధమైన నూతన తరగతి గదుల భవనం

జగ్గయ్యపేట(పెనుగంచిప్రోలు): విద్య ద్వారానే పేదల్లో అభివృద్ధి సాధ్యమని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, విద్యారంగ అభివృద్ధి కోసం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన తరగతి గదులు, డిజిటల్ తరగతులు, నాణ్యతతో కూడిన భోజనం, స్కూల్ ప్రారంభం రోజునే పుస్తకాలు, బ్యాగులు, షూస్ వంటి వస్తువులను అందించడం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం ద్వారా విద్యారంగంలో ఓ నూతన ఒరవడికి నాంది పలికారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న చర్యల కారణంగా ఆయా స్కూళ్లు, హాస్టళ్లు, గురుకుల పాఠశాలలకు అన్ని వసతులు సమకూరి వాటి స్వరూపాలే మారిపోయాయి. అందుకు జగ్గయ్యపేట పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలుర)నే చక్కటి ఉదాహరణ.

12 తరగతి గదుల నిర్మాణం..

నాబార్డు నిధులు రూ.1.52కోట్లతో విశాలమైన తరగతి గదుల నిర్మాణం పనులను గతంలో చేపట్టారు. అయితే పనులు మాత్రం పూర్తికాలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను వెంటనే స్పందించి కేంద్రప్రభుత్వం నిధులు మరో రూ.80లక్షలు మంజూరు చేయించారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌తో ఎప్పటికప్పుడు చర్చిస్తూ పనులు సకాలంలో పూర్తయ్యేలా పర్యవేక్షించారు. మొత్తం రూ.2.32కోట్ల నిధులతో 12 విశాలమైన తరగతి గదులు, 16 టాయిలెట్లు, ఒకేసారి 120మంది విద్యార్థులు భోజనం చేసేలా డైనింగ్ హాలు, వాష్ ఏరియా, కిచెన్‌ను నిర్మించారు. ఆధునిక వసతులు కల్పించారు. పాఠశాల ఎదుట శుభ్రంగా ఉండేలా రూ.9 లక్షలతో డ్రైనేజీ కాల్వ, కల్వర్టు నిర్మాణం చేపట్టారు. ఇలా విద్యారంగ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న విశేష కృషిపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 31వ తేదీన గురుకుల పాఠశాలలోని తరగతి గదుల భవనం, డైనింగ్ హాలును ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమస్యలు తీరాయి..



స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ప్రత్యేక కృషితో పాఠశాలలో ఎంతో కాలంగా ఉన్న సమస్యలు తీరాయి. విశాలమైన తరగతి గదులు, డైనింగ్ హాలు అందుబాటులోకి రానుంది. మంచి నీటి సమస్య కూడా పరిష్కారమైంది. త్వరలో ఆయా భవనాలు ప్రారంభం కానుండటం సంతోషంగా ఉంది.

టి ఉమేష్‌బాబు, ప్రిన్సిపాల్

జగనన్న పాలనలో విద్యకు అగ్రస్థానం..



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో విద్యకు అగ్రస్థానం దక్కింది. నాడు–నేడు పథకం కింద పాఠశాలల్లో అత్యాధునిక వసతులు కల్పిస్తున్నాం. జగ్గయ్యపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలుర)లోని విద్యార్థులకు అన్ని వసతులు అందుబాటులోకి రావడం ఆనందంగా ఉంది.

సామినేని ఉదయభాను, ప్రభుత్వవిప్



నూతన డైనింగ్ హాలు భవనం



తరగతి గదిలో విద్యార్థుల కోసం కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటు చేసిన బల్లలు

నేడు ఆలయాల మూసివేత

జగ్గయ్యపేట: చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని తిరుమలగిరిలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయం, వేదాద్రిలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను శనివారం మూసివేస్తున్నట్లు ఆలయ ఈవో జయప్రకాష్‌బాబు శుక్రవారం తెలిపారు. పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా సాయంత్రం ఆరు గంటల నుంచి ఆదివారం ఉదయం ఏడు గంటల వరకు ఆలయాలను మూసివేస్తున్నట్లు వివరించారు. సంప్రోక్షణ అనంతరం ఆదివారం భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం ఐదు గంటలకు స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయం మూసివేయనున్నట్లు ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఆదివారం ఉదయం సంప్రోక్షణ అనంతరం తొమ్మిది గంటలకు భక్తులకు అమ్మవారి దర్శనానికి అనుమతిస్తామని ఈవో వివరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం

వీరులపాడు:జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పథకం పనులు కల్పించేలా ఫీల్డ్‌అసిస్టెంట్లు పనితీరు ఉండాలని ఏపీవో జనార్దన్ సూచించారు. వీరులపాడులోని ఉపాధి హామీ పథకం కార్యాలయంలో మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లుతో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ కూలీలందరికీ చేసిన పనికి తగిన వేతనం అందేలా చూడాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సూచించారు. అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'తో తక్షణ పరిష్కారం

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

కంచికచర్ల : జగనన్నకు చెబుదాం కార్యక్రమంతో ఆయాసమస్యలు తక్షణమే పరిష్కారమవుతున్నాయని, జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు వివరించారు. ప్రతి నియోజకవర్గంలో జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. స్పందనలో వచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులకు పంపటమే కాక వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామన్నారు. జగనన్నకు చెబుదాం ద్వారా స్వీకరించిన అర్జీల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యవసాయ భూములు, నివేశనస్థలాలు, రేషన్‌కార్డులు, పింఛన్లు తదితర అర్జీలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన అర్జీ వివరాలను రికార్డుల్లో నమోదు చేసి, ఎప్పటిలోగా పరిష్కారం అవుతుందనే సమాచారాన్ని కూడా అర్జీదారులకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి అర్జీల వివరాలను సీఎం కార్యాలయానికి తెలియజేస్తున్నట్లు వివరించారు.

ప్రజలకు ఎంతో మేలు..

ప్రజల సమస్యల పరిష్కారానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రజలకు ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక అధికారుల స్థాయిలో పరిష్కారాం కాని సమస్యలను జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా పరిష్కారమవుతున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, ఉప సర్పంచి వేమా సురేష్‌బాబు, నందిగామ ఆర్డీవో ఏ రవీంద్రరావు, డ్వామా పీడీ జే సునీత, జిల్లా ఉద్యానశాఖ అధికారి బాలాజీకుమార్, జిల్లా పరిషత్ సీఈవో వి.జ్యోతిబసు, డీపీవో జయచంద్రగాంధీ, సోషల్ వెల్ఫేర్ అధికారి బి.విజయభారతి, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, జిల్లా హౌసింగ్ అధికారి రజినీకుమారి, డీసీహెచ్ఎస్ బీసీకే నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.ఇందుమతి, తహసీల్దార్ బి.శంకరబాబు, ఎంపీడీవో కె.శిల్ప, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి విశేష కృషి

ప్రభుత్వ విప్ ఉదయభాను



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉదయభాను, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక

చిల్లకల్లు(జగ్గయ్యపేట): రాష్ట్రంలో మహిళాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి శుక్రవారం ఆయన జెడ్పీ నిధులతో మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పలు పథకాలతోపాటు రుణాలను అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నామినేటెడ్ పదవులలో సైతం మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాల్లో మహిళలను భాగస్వాములను చేసి మహిళాపక్షపాతిగా పేరు తెచ్చుకున్నారని చెప్పారు. గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారి ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్నారని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయాల బయట డ్వాక్రా మహిళల కోసం షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ హారిక మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు కుట్టుశిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యులు వూట్ల నాగమణి, ఏసుపోగు దేవమణి, యువనాయకుడు సామినేని వెంకట కృష్ణప్రసాద్, కేడీసీసీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, జిల్లా చేనేత విభాగం కన్వీనర్ పెంటు శ్రీనివాసరావు, మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కొలుసు రమాదేవి, మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్యామల, మహిళా కన్వీనర్ కాసరగడ్డ సీతమ్మ, నాయకులు జానకిరామయ్య, నాగబాబు, ఇజ్రాయిల్, వేణు, శ్రీను, రాజు పాల్గొన్నారు.

అర్బన్ మార్కెట్లతో అందరికీ ప్రయోజనం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



మార్కెట్‌ను ప్రారంభించి, స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: పొదుపు సంఘాల మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్బన్ మార్కెట్‌లను ఏర్పాటు చేస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. స్థానిక గాంధీ సెంటర్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ఆయా స్టాళ్లలోని తినుబండారాలు, జూట్ బ్యాగులు, ఇతర వస్తువులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ స్వయంసహాయక సంఘాల మహిళలు తయారీచేసే ఆయా ఆహార పదార్థాలు, ఇతర వస్తువులకు స్థానికంగానే మార్కెట్ సదుపాయం కల్పించేందుకు ఈ అర్బన్ మార్కెట్లు దోహదపడతాయన్నారు. ప్రజలకు కూడా తక్కువధరకే నాణ్యమైన ఆహారపదార్థాలు, ఇతర వస్తువులు లభిస్తాయని వివరించారు. ఇలా స్వయం సంఘాల మహిళలు, వినియోగదారులకు ఈ అర్బన్ మార్కెట్లతో ఎంతో ప్రయోజనం కలుగుతుందని వివరించారు. మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పనిచేస్తున్నారన్నారు. పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేస్తున్న ఉత్పత్తులను విక్రయించుకోవడానికి వీలుగా ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే మహిళల ఆర్థికాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవటంతోపాటు పలు పథకాల ద్వారా వారికి అండగా నిలిచారని గుర్తు చేశారు. వైఎస్సార్ చేయూత, ఆసరాతోపాటు సున్నా వడ్డీకే రుణాలు అందించి మహిళలకు చేయూత నందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా మరింత ఉన్నతస్థితికి చేరాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే జగన్‌మోహనరావును మెప్మా ఉద్యోగులు, మహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, షేక్ కరిముల్లా, నరేంద్ర, సిటీ మిషన్ మేనేజర్ దయావతి, కార్యక్రమ కోఆర్డినేటర్ సత్యవతి, సీవోలు కవిత, విజయలక్ష్మి, వరలక్ష్మి, మెప్మా అధికారులు, సిబ్బంది, నాయకులు, పెద్దసంఖ్యలో స్వయంసహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భారీగా విరాళాలు



విరాళం అందజేస్తున్న వాణిసుజాత, రవి

పెనుగంచిప్రోలు: స్థానిక మునేరు కాజ్‌వే పక్కన నిర్మాణంలో ఉన్న శ్రీస్వయంభు శంభులింగేశ్వర స్వామి, శ్రీఅయ్యప్పస్వామి, ఉపాలయాల నిర్మాణాలకు పలువురు భక్తులు శుక్రవారం విరాళాలను అందజేశారు. గ్రామానికి చెందిన దేవరశెట్టి పవన్‌కుమార్ ట్రస్టు చైర్మన్ రాంబాబు రూ.లక్ష, బాణావతు వాణిసుజాత, రవి రూ.1.01,116, కంచేటి శ్రీనివాసరావు దంపతులు రూ.1,00,116, నల్లపునేని దైవాదీనం రూ.50,116లను ఆలయ నిర్మాణ నిర్వాహకులు వాసిరెడ్డి బెనర్జీ, శనగవరపు శాస్త్రిలకు అందజేశారు. కార్యక్రమంలో దాతల కుటుంబసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

138 మద్యం సీసాలు స్వాధీనం



పట్టుబడిన మద్యం సీసాలతో ఏసీపీ జనార్దన్‌నాయుడు, పోలీసులు



వాహనాలను తనిఖీ చేస్తున్న నందిగామ పోలీసులు

వీరులపాడు: మద్యం అక్రమ రవాణాకు పాల్పడినా, విక్రయాలు చేసినా కఠిన చర్యలు తప్పవని ఏసీపీ జనార్దన్ నాయుడు హెచ్చరించారు. అల్లూరులో శుక్రవారం రాత్రి కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణా నుంచి మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్న పల్లెసురత్నం, ముంగి సీతయ్య వద్ద నుంచి 100 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏసీపీ వివరించారు. ఈ కార్యక్రమంలో నందిగామ రూరల్ సీఐ నాగేంద్రకుమార్, సబ్‌ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మణుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: అక్రమ మద్యం రవాణాకు పాల్పడేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హనీష్ హెచ్చరించారు. మండలంలోని జొన్నలగడ్డ గ్రామం వద్ద గల రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో మధిర ప్రాంతం నుంచి నందిగామ ప్రాంతానికి మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 38 మద్యంసీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎస్సై పండు దొర, పోలీసులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట: డ్వాక్రా సంఘాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. పట్టణంలోని 11వ వార్డు దుర్గాపురంలో కనకదుర్గ మహిళా పరస్పర సహాయ సహకార సంఘం ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళల మహాజన సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు కలిసికట్టుగా సంఘాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధిని సాధించాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా సంఘాల అభివృద్ధికి ఎంతో కృషి చేయడంతోపాటు ఇప్పటివరకు నాలుగు విడతలలో రుణమాఫీ, సున్నా వడ్డీ అందించి మాట నిలుపుకున్నారని గుర్తుచేశారు. వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు పందుల రోశయ్య, కాటగాని నరసింహారావు, పట్టణ చేనేత విభాగం కన్వీనర్ పెంటు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈనెల 31న డిప్యూటీ సీఎం రాక..

పట్టణంలోని రూ.2.32 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను ఈనెల 31న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో కలిసి ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖా మంత్రి పి.రాజన్న దొర ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని కోరారు.

646 మందికి వైద్యపరీక్షలు

బూదవాడ(జగ్గయ్యపేట): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి అనిల్‌కుమార్ కోరారు. మండలంలోని బూదవాడలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యాధికారులు అనిల్‌కుమార్, స్రవంతి, కీర్తిరెడ్డి, విద్యాసాగర్ పాల్గొని 646మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలందిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టా ప్రతాప్‌రెడ్డి, బాల్యా నాయక్, గడ్డం శ్రీను, రామిశెట్టి భద్రాచలం, రామదాసు, గోవింద్, భూపతిరావు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించేలా పరిశోధనలు



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న మల్లికార్జునరెడ్డి

గరికపాడు(జగ్గయ్యపేట): వ్యవసాయ పరిశోధనా స్థానాలలో శాస్త్రవేత్తలు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేలా పరిశోధనలు చేయాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడు డాక్టర్ ఎం. మల్లికార్జున రెడ్డి కోరారు. గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించి, ఆయా పంటల సాగుపై వారికి శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు తగిన సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు సాధ్యమనే అంశాన్ని రైతులు గుర్తించేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మట్టినమూనాల పరీక్షించే ల్యాబ్‌రేటరీని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణంరాజు, శాస్త్రవేత్తలు మధువాణి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తే కఠినచర్యలు



జగ్గయ్యపేట: తెలంగాణా నుంచి ఏపీకి అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని గరికపాడు, ముక్త్యాల సరిహద్దు చెక్‌పోస్టులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం వస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నందున ముమ్మర తనిఖీలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కె.అగ్రహారం సమీపంలోని స్ఫటిక తయారీ కర్మాగారాన్ని, కోహెన్స్ కర్మాగారంలోని స్పిరిట్‌ను పరిశీలించారు. ఎస్ఈబీ సీఐ శ్రీహరి, సుధాకర్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు

వీరులపాడు: రాష్ట్ర సరిహద్దు గ్రామాల సమీపంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మర తనిఖీలు చేస్తున్నట్లు ఎస్ఐ మహాలక్ష్మణుడు తెలిపారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఆయన వాహనాల తనిఖీలు నిర్వహించారు. పెద్దాపురం, వీఅన్నవరం, దొడ్డదేవరపాడు గ్రామాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.